నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్

టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దైనందిన జీవితంలో డైరీ, క్యాలెండర్ ఎంతో దోహద పడతాయన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఉపాధ్యాయ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నాయకునిగా ఉపాధ్యాయుల సమస్యలు అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, జిల్లా కమిటీ సభ్యులు బక్కన్న, రమేష్ మనోహర్, లక్ష్మణ్, భీమయ్య, గంగాధర్, రాజేందర్, నాగయ్య, పోశెట్టి, మురళి, రమేష్, భూమన్న పాల్గొన్నారు.



24న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎస్ఎంటి, మెడ్‌ప్లస్, టీంలీస్, అపోలో ఫార్మా, శ్రీరాం జనరల్ ఇన్సూరెన్స్ ఐదు కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 2023లో డిగ్రీ అయిపోయిన, ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24న రెస్యూమ్‌తో పాటు ఫొటోలతో ఉదయం 10గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కొరకు చైతన్య కృష్ణ(9885762227)ను సంప్రదించాలన్నారు.

డీ1 పట్టాల పేరిట ప్రభుత్వ భూముల కబ్జా

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ నియోజకవర్గంలో గత పాలకులు డి1 పట్టాల పేరిట భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూ నిర్వాసితుల భూముల పేరిట భారీ రాకెట్ నడిచిందన్నారు. దాదాపు 2వేల ఎకరాలకుపైగా డీ1 పట్టాలతో ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. ఎస్సారెస్పీ ముంపు బాధితులతో గత పాలకులు చెలగాటం ఆడారని, బోగస్ పేర్ల మీద డీ1 పట్టాలు సృష్టించి భూములను ఆక్రమించారని అన్నారు. డీ1 పట్టాల ఆక్రమణల రాకెట్ వెనకాల గత పాలకులతో పాటు కొందరు అధికారుల హస్తం కూడా ఉందని ఆరోపించారు. పట్టాల పంపిణీ పేరుతో ప్రభుత్వ భూములు కబ్జా చేశారని మండిపడ్డారు. పట్టాలు బోగస్ పేర్ల మీద వేరే వారికి ఇవ్వడంతో నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపాడ్, మామడ మండలం న్యూసాంగ్వి, న్యూ లింగంపల్లి, ఆదర్శనగర్ గ్రామంలో ప్రజలు తీవ్రంగా మోస పోయారన్నారు. కేవలం సాంగ్వి గ్రామంలోనే 180 ఎకరాల భూమిని డీ1 పట్టాల పేరిట కబ్జా చేశారని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి నిర్మల్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై రీసర్వేతో పాటు కమిటీని ఏర్పాటు చేయించి, అక్రమాలకు పాల్పడిన వ్యక్తులను చట్ట పరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రావుల రాంనాథ్, తక్కల రమణారెడ్డి, రమేష్, సాగర్, భూపతిరెడ్డి, భూపాల్‌రెడ్డి, చంద్రకాంత్, వొడిసెల అర్జున్, జమాల్, వీరేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 1079 మందికి 850 మంది హాజరు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష జిల్లాలోని 5 సెంటర్లలో ఉదయం 11.30 నుండి 1.30 వరకు ప్రశాంతంగా ముగిసింది. జిల్లా విద్యాధికారి అశోక్ ఆయా సెంటర్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 5 సెంటర్లలో 1079 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 850 మంది హాజరైనట్లు తెలిపారు. సిర్పూర్(టి) ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 228 మందికిగాను 189 మంది, కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో 240 మందికి 148 మంది, సెయింట్ క్లారెంట్‌లో 218గాను 148 మంది, జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో 216 మందికి 181 మంది, తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 177 మందికి 141 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 74.60 శాతం మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు వివరించారు.

నాగోబా జాతర పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో శనివారం ఆదివాసుల ఆరాధ్య దైవం నాగోబా జాతర పోస్టర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఐటీడీఏ పిఓ చాహత్ బాజ్‌పాయ్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అధికారులు, మెస్రం వంశీయులతో కలిసి ఆవిష్కరించారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జలగం అనిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కామర్స్ పోస్టు ఒకటి ఖాళీ ఉందని పేర్కొన్నారు. పీజీ సబ్జెక్టులలో ఎస్సీ, ఎస్టీ వారికి 50శాతం, ఇతర వారికి 55శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధన అనుభవం ఉన్నవారికి అదనపు అర్హతగా పరిగణిస్తామన్నారు. ఆంగ్లంలో బోధించే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు జనవరి 25 వరకు కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని పేర్కొన్నారు. 27న ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డెమో క్లాసు ఉంటుందని పేర్కొన్నారు.

దిగుబడి రాక దిగులు..!

- ఏటా తగ్గిపోతున్న పత్తి దిగుబడులు
- వర్షాభావం..తెగుళ్ల కారణంగా తీవ్ర నష్టం
- మార్కెట్‌లోనూ పంటకు గిట్టుబాటు ధర దక్కని వైనం
- నాణ్యత లేదని ధరలో కోత విధించిన సీసీఐ
- ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న అన్నదాతలు

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న అన్నదాతలను ఆర్థిక కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఆరు గాలం కష్టపడి పంటలు పండించినా..ఆశించిన దిగుబడి రాకపోవడంతో దిగులు చెందుతున్నారు. వర్షాభావం, వివిధ రకాల తెగుళ్ల కారణంగా కాత, పూత దశలో ఎదుగుదల లోపించి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఫలితంగా ప్రతి ఏటా పత్తి పంట దిగుబడులు తగ్గిపోతుండటం అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన ఆ కాస్త పంటకు కూడా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఆర్థికంగానూ తీవ్ర నష్టాలకు గురికావాల్సి వస్తోంది. మరోపక్క పుండుమీద కారం చల్లినట్లు పత్తిలో నాణ్యత లేదనే కారణంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత పత్తి సంస్థ(సీసీఐ) ధరలో కోత విధించడం అన్నదాతలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే తేమ పేరిట ధరలో కోత విధించగా.. మరోపక్క సీసీఐ కూడా ధర తగ్గించడం అన్నదాతలను మరింత కుంగుబాటుకు గురిచేస్తోంది.



బేల మండలం శంషాబాద్ గ్రామానికి చెందిన ఈ రైతు పేరు దేవిదాస్ ఖోడె. తనకున్న ఐదు ఎకరాల పొలంలో పత్తి సాగు చేశారు. గతంలో ఎకరానికి కనీసం 12క్వింటాల్ వరకు పంట దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది మాత్రం కాలం కలిసిరాకపోవడంతో కేవలం ఎకరానికి 6క్వింటాల్‌లు మాత్రమే వచ్చిందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక మంది రైతులకు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే పత్తి పంటకు ప్రధాన కేంద్రంగా భావిస్తారు. లక్షలాది మంది పత్తి రైతులు వర్షాధారం మీద ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. కానీ ఇదే పంట రైతులను ఏటా నష్టాల పాలు చేస్తోంది. ఖరీఫ్ తొలినాళ్లలో నకిలీ విత్తనాల బెడద తలెత్తగా.. మొలకెత్తిన తర్వాత అతివృష్టి..లేదంటే అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతినడం సాధారణ విషయంగా మారుతోంది. తొలినాళ్లలో అతివృష్టి సంభవిస్తే..పంట ఎదుగుదల దశలో వర్షాభావ పరిస్థితులు తలెత్తుతున్నాయి. వీటికి తోడు పంట ఎదుగుదల సమయంలో వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పూత,కాత రాలిపోయి దిగుబడిపై ప్రభావం పడుతోంది. కిందటేడాది ఉమ్మడి జిల్లాలో 10.30లక్షల ఎకరాల్లో పత్తి పంట వేయగా.. ఎకరానికి కేవలం 8క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని భావిస్తే సుమారు 82లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉంటుంది. కానీ కేవలం 35లక్షల క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ ఏడాది సైతం అదే స్థాయిలో సాగు విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు కేవలం 20లక్షల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్‌కు వచ్చిందని అధికారులు చెబుతున్నారు. సీజన్ ముగిసే వరకు మరో 20లక్షల క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

గిట్టుబాటు దక్కని వైనం..!

ఈ ఏడాది సైతం పత్తి దిగుబడులు తీవ్రంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు, పురుగుమందులు తదితర పెట్టుబడుల కోసం తీసుకొచ్చిన అప్పులు సైతం తీరే అవకాశం లేదని వాపోతున్నారు. మరోపక్క పండించిన ఈ కాస్త పంటకు కూడా మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర దక్కడం లేదు. ఇన్నాండ్లు సీసీఐ క్వింటాల్‌కు రూ.7020వరకు చెల్లించగా..ప్రయివేటులో క్వింటాల్‌కు రూ.6630 వరకు ఉంది. మద్దతు ధర కంటే ప్రయివేటులో తక్కువగా ఉండటంతో గత్యంతరం లేని పరిస్థితిలో రైతులు పంటను విక్రయించాల్సి వచ్చింది. తొలుత ప్రయివేటులో ధర తక్కువగా ఉండటంతో అనేక మంది రైతులు సీసీఐకి విక్రయించారు. కానీ కొన్ని రోజులుగా సీసీఐ కూడా నాణ్యత లేదనే కారణంగా ధర తగ్గించడం రైతులకు మరింత అవస్థలు తెచ్చిపెట్టింది. ఉమ్మడి జిల్లాలో 24 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉండగా.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.50 తగ్గించిన సీసీఐ మిగితా కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.100చొప్పున తగ్గించడం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేసేలా మారింది. ప్రభుత్వ రంగ సంస్థనే ధర తగ్గించడంతో ప్రయివేటు వ్యాపారులు సైతం మరింత తగ్గించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫలితంగా రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంటుంది.



కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

- చైర్మన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా 21మంది కౌన్సిలర్లు
- పదవి కోల్పోయిన చైర్మన్, వైస్ చైర్మన్
- త్వరలో నూతన్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక



అవిశ్వాసానికి మద్దతు తెలిపిన 21 మంది కౌన్సిలర్లు

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీష్ కుమార్‌పై ప్రవేశపెట్టి అవిశ్వాస తీర్మానం క్యాంపు రాజకీయాల అనంతరం ఎట్టకేలకు శనివారం నెగ్గింది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లపై గత డిసెంబర్ 20న డీఆర్‌ఓ సురేష్‌కు బీఆర్‌ఎస్‌కు చెందిన 24 మంది కౌన్సిలర్లు అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయడానికి సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. దీంతో శనివారం ఉదయం 11.30 గంటలకు అవిశ్వాస తీర్మాణానికి హాజరుకావాలని మున్సిపాలిటీ పరిధిలోని 30మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు అవిశ్వాస తీర్మాన నోటీసులు జారీ చేశారు. అవిశ్వాస తీర్మానంపై కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి సురేష్ కుమార్ నేతృత్వంలో శనివారం ఉదయం 11.30గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ ఛైర్మన్ రాచకొండ గిరిష్ కుమార్‌పై అవిశ్వాసానికి 23 మంది కౌన్సిలర్లు హాజరు కాగా 21 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో మున్సిపల్ చట్టం ప్రకారం ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులపై జరిగిన అవిశ్వాస తీర్మాన రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు ప్రిసైడింగ్ అధికారి పంపించారు. నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో తేదీ ప్రకటించి ఎన్నికలు జరుపుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏవో ప్రమోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది క్రాంతి, బావు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించడంతోనే అవిశ్వాసం

కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ ఛైర్మన్ రాచకొండ గిరిష్‌కుమార్ పట్టణ అభివృద్ధిని విస్మరించడంతోనే అవిశ్వాసం ప్రవేశపెట్టామని పలువురు కౌన్సిలర్లు స్పష్టం చేశారు. క్యాంపుకు వెళ్లిన 21మంది కౌన్సిలర్లు అవిశ్వాస సమావేశానికి ప్రత్యేక వాహనాల్లో మున్సిపల్ కార్యాలయాలనికి ఉదయం 11గంటల ప్రాంతంలో చేరుకున్నారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తు మధ్య కౌన్సిలర్లను మున్సిపల్ కార్యాలయంలోనికి తీసుకెళ్లారు. ప్రిసైడింగ్ అధికారి సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో మెజార్టీ కౌన్సిలర్లు 21 మంది మద్దతు తెలిపారు. అనంతరం బయటకు వచ్చిన కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో కాగజ్‌నగర్ పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని స్పష్టం చేశారు. కౌన్సిలర్లను సైతం విస్మరించారని, ఏకపక్ష నిర్ణయాలతో పట్టణ అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. పాలకవర్గం ఏకతాటిపై వచ్చి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టామని పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మాణానికి మద్దతు తెలిపిన కౌన్సిలర్లకు తోటి కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరిన కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పనకు మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని మాజీ ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రిసైడింగ్ అధికారి సురేష్ కుమార్



మున్సిపల్ కార్యాలయం ఎదుట బందోబస్తులో డీఎస్పీ, సీఐ

వివిధ సంఘాల మున్సిపల్ కార్మికులు సీఐటీయూలో చేరిక



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మున్సిపాలిటీలో పని చేస్తున్న వివిధ సంఘాల్లో ఉన్న మున్సిపల్ కార్మికులు శనివారం సీఐటీయూలో చేరారు. వీరికి జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ సంఘం కండువాతు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల పక్షాన నిలిచి వారి సమస్యలపై నిరంతర పోరాటాలు చేసే యూనియన్ సిఐటియు అని పేర్కొన్నారు. తొలిసారి నిర్మల్ మున్సిపల్ కార్మికులు సిఐటియులో చేరారని పేర్కొన్నారు. ఇటీవల వీరి పలు సమస్యలపై పోరాటాలు చేసి విజయం సాధించామని తెలిపారు. భవిష్యత్తులో సైతం ఇతర సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. వివిధ సంఘాల నుండి 64 మంది కార్మికులు సిఐటియులో చేరారని తెలిపారు. అనంతరం సిఐటియు అనుబంధంగా మున్సిపల్ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కిషన్ కుమార్, అధ్యక్షులుగా బాబిలి రాజమణి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, సుశీల, ప్రధాన కార్యదర్శిగా చుంచు శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా రాజేశ్వర్, వాజర్, కోశాధికారిగా రజితను ఎన్నుకున్నారు.

పేదల పొట్టగొట్టే ఆలోచన విరమించుకోవాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

అటవీశాఖ అధికారులు పేదల పొట్టగొట్టే ఆలోచన విరమించుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టీఏజీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బాలభారతి హైస్కూల్‌లో తునికాకు కల్లేదార్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాస్ మాట్లాడుతూ తునికాకు సేకరణ ద్వారా ఆదివాసులు ఇతర పేదలు ఉపాధి పొందుతారని అన్నారు. జిల్లాలో 30వేల మంది కూలీలు ఉపాధి పొందుతారని, కూలీలతోపాటు కల్లేదారులు, గోడౌన్ కార్మికులు, కాంట్రాక్టర్లు ఆదాయం పొందుతారన్నారు. ప్రభుత్వానికి ఎలాంటి ఖర్చు లేకుండా ఆదాయం వస్తుందని, జిల్లాలోని ఫారెస్ట్ అధికారులు పెద్ద పులులు సంచరిస్తున్నాయన్న నెపంతో తునికాకు యూనిట్లను రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫారసులు చేశారని పేర్కొన్నారు. దీనివల్ల పేదలు నష్టపోతారని, జిల్లాలో రెండు డివిజన్ల పరిధిలో మొత్తం 25 యూనిట్లు ఉండగా మైనింగ్, కవ్వాల్ టైగర్ కారిడార్, కడంబ టైగర్ కారిడార్ పేరుతో ఇప్పటికే చాలా యూనిట్లను తగ్గించారన్నారు. అటవీ అధికారులు పునరాలోచించాలని, ఎమ్మెల్యేలు స్పందించాలని కోరారు. వెంటనే తునికాకు టెండర్లు పిలవాలని, లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా తునికాకు కల్లేదారుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా చన్నపురి కాశీనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే నయిమ్, కోశాధికారిగా సోయం తిరుపతి, ఉపాధ్యక్షులుగా టేకం హనుమంతు, సహాయ కార్యదర్శిగా ఒండ్రే గణేష్, కమిటీ సభ్యులుగా శ్రీనివాస్‌గౌడ్, అజీజ్, బోరెం తిరుపతి, యాదగిరి నాందేవ్, పెందం రవి, ఎల్మలే దశరథ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కొరెంగా మాలశ్రీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, వివిధ మండలాల కల్లేదార్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కుమురం భీం జిల్లాలోని కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 పరీక్ష కేంద్రాలను



ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 4, 458 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 3,703 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు పరీక్ష కేంద్రాలను డీఈఓ ప్రణీత సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. 6వ తరగతిలోని 80 సీట్లకు గాను ఈ పరీక్ష జరిగింది.

పదవీకాలం పొడిగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు తమ పదవీకాలం పొడిగించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కరోనా కాలంలో రెండు సంవత్సరాలు వృథాగానే కాలం గడిచిపోయిందన్నారు. ఆర్థికంగా భారీ నష్టం జరిగిందని నెల నెలకు జమ అయ్యే నిధులు జమ కాకపోవడంతో పాటు పనులకు బిల్లులు రాక నిర్వహణ భారంగా మారిందని అన్నారు. నిధులు లేక అప్పు తీసుకొచ్చి సొంత నిధులతో గ్రామాభివృద్ధికి కృషి చేశామని అన్నారు. 1996 వరకు ఏ విధంగానైతే అప్పటి సర్పంచులకు రెండు సంవత్సరాల వరకు పర్సన్ ఇన్‌చార్జిగా పదవీ కాలం పెంచారో అదే విధంగా పెంచాలని కోరారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్‌లు భూమన్న, కుమ్ర శ్యామ్ రావు, లక్ష్మణ్, దుర్వ రామచందర్, శ్రీనివాస్, వసంత్, కుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి డి. మనోహర్ అన్నారు. శనివారం విద్యార్థి కళాశాలలో రోడ్డు భద్రత మసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్, మోటర్ వెహికిల్ చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణ శాఖ అధికారి డి. మనోహర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఏటా జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు మసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు కూడా రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను తెలుసుకుంటూ వాటిని ఇతరులకు తెలియజేయాలన్నారు. దీని ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రవి కుమార్, ఏఎంవీఐ సురేష్, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు చాందా(టి) విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జెడ్పీఎస్ఎస్ చాంద(టి) రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ విద్యా సంవత్సరం ప్రదర్శనకు 6 ఉప అంశాలలో 153 ప్రాజెక్టులు పాల్గొన్నాయి. దీనిలో చాంద(టి) విద్యార్థులు పడాల కార్తిక్, అంబటి విఘ్నేష్, కమ్యూనికేషన్ ట్రాన్స్‌పోర్టు విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ బొడగరి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌రావు, విద్యార్థులను, గైడ్ టీచర్ ఆరె భాస్కర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అమరేందర్, విద్యాసాగర్, మధుకర్ వర్మ, దేవిదాస్, రాంకుమార్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

నవతెలంగాణ-ముథోల్

మండలాల్లోని వివిధ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు జనవరి 31 వరకు ఇంటి పన్ను వసూలు చేయాలని డీఎల్‌పీఓ శివకృష్ణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ముథోల్, బాసర, తానూర్ మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలతో జీపీడీపీపై సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఈ నెల 31లోపు పకడ్బందీగా తయారు చేయాలని సూచించారు. అలాగే గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పచ్చదనం పరిశుభ్రత పెంపొందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం 9గంటల లోపే డిఎస్ఆర్ అటెండెన్స్ చేయాలని పేర్కొన్నారు. ప్రణళికాబద్ధంగా అభివృద్ధి ప్రణాళిక తయారుచేసి అందజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీఈఓలు అమీర్‌ఖాన్, మన్మోహన్ శాస్త్రి, మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. వారినుద్దేశించి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, వాటి వల్ల కలిగే అనర్థాలపై చర్చించారు. జనవరి 29న జరగబోయే విద్యా కమిటీ ఎన్నికల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకటరమణ, మురళీ, వినోద్‌కుమార్, వెంకట రాములు, పోషకులు చిట్యాల చిన్నయ్య, దాసు, లింగాల సత్తన్న, శ్రీవాణి పాల్గొన్నారు.

కదిలి పాపహరేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దిలావర్‌పూర్



ఎమ్మెల్యేగా విజయం గెలుపొందిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మొదటిసారిగా శనివారం కదిలి పాపహరేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. శివరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నందున ఆలయ పరిసరాల్లోని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పండగకు ముందే ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ పరిశుభ్రతలో భాగంగా కదిలి ఆలయంలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తక్కల రమణరెడ్డి, దొడ్డికింది ముత్యంరెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ వీరేష్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, శైలేశ్వర్, ఉత్తమ్ పటేల్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్ పటేల్, దనే నర్సయ్య, సుధాకర్, చక్రి, గణేష్ పటేల్, గంగాధర్, విజయ్, రాజు పటేల్, దిగంబర్ పటేల్ పాల్గొన్నారు.

కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను సన్మానించిన ఉత్సవ సమితి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రామమందిర ప్రాణప్రతిష్ట జనవరి 22న జిల్లాలో సెలవు ప్రకటించేలా చూడాలని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అర్చక పురోహితులు కోరారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ముందుగా వేదమంత్రోచ్చరణల నడుమ ఆశీర్వాచనలు అందించి శాలువాతో సత్కరించారు. 22న గోపాల కృష్ణమఠంలో జరిగే పూజాది కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ 500 సంవత్సరాల నిరీక్షణకు జనవరి 22తో పూర్తి అవుతుందన్నారు. రామమందిర ప్రాణప్రతిష్ట జరుగుతుందన్నారు. అదే రోజు కొన్ని రాష్ట్రాల్లో సెలవు ఇచ్చారని, ఆదిలాబాద్‌లో కూడా సెలవు ప్రకటించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడం మహాదేవ్, సుభాష్, అర్చకులు పుప్పల సంతోష్, ప్రవీణ్ శర్మ ఉన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-భైంసా

గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎంపిపి అబ్దుల్ రజాక్ అన్నారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీని ఐకెపి కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ సహకారంతో మండలాన్ని దశల వారీగా అభివృద్ధి పరుస్తానన్నారు. గ్రామాల్లో ఏమైన సమస్యలుంటే తనకు తెలియజేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మణ్, సీసీలు భీంరావు, లక్ష్మణ్, లావణ్య, అకౌంటెంట్ సిందే లక్ష్మణ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ లోని కేబి కాంప్లెక్స్ క్రీడా మైదానంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ ముగింపు కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, పీఓ చాహత్ బాజ్‌పాయ్‌లు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించాలని అన్నారు. ఆటలతో పాటు చదువులోను రాణించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించడంతో క్రీడాకారులు ఒలంపిక్స్, ఆసియన్ వంటి గేమ్‌లలో 200 పైగా పతకాలు సాధించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రాలలో ఖేలో ఇండియా వంటి పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు ముందుకు రావాలని అన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వికాసం, ఆరోగ్యం కోసం ఇలాంటి స్పోర్ట్స్ కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసమని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేయాలని అన్నారు. పీఓ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్‌లలో ర్యాంక్‌లు సాధిస్తున్నారని అన్నారు. అలాగే క్రీడలలో జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకువస్తున్నారని అన్నారు. విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు మెనూ ప్రకారం భోజనం అందిస్తూ, ప్రత్యేక కోచ్‌లను నియమించడం జరిగిందని తెలిపారు క్రీడాకారులకు కోచ్, పీడీ ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి మాట్లాడుతూ 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్, ఆర్చరీ వంటి క్రీడలను ఉట్నూర్ లో నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, డీడీ దిలీప్ కుమార్, ఏటీడీఓ క్రాంతికుమార్, క్రీడా అధికారి పార్థసారథి, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కప్పును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం

- ఫిబ్రవరి 16న సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి యాటల సోమన్న



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సోమన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి యాటల సోమన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు కావస్తున్న ప్రజలకు, కార్మికులకు, రైతులకు ఉపయోగపడే పనులు ఏ ఒక్కటి చేయలేదని అన్నారు. గత పది సంవత్సరాలుగా దేశ కార్మికవర్గం పైన ప్రజానీకం పైన ఎనలేని భారాలని మోపుతూ హక్కులను దూరం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు.

ఫిబ్రవరి 16న బందుకు పిలుపు

బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్త కార్మిక సమ్మెకు గ్రామీణ బంద్‌కు పిలుపునిస్తున్నామని ప్రకటించారు. ఈ గ్రామీణ బంద్‌ను సమ్మెను కార్మికులు కర్షకులు వ్యవసాయ కార్మికులు అందరూ కలిసి జయప్రదం చేయాలని అన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వాటాల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెంచి బలోపేతం చేయాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, శాస్త్రీయ పద్ధతుల్లో ప్రతి పంటకు గిట్టుబాటు ధరలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలన్నారు. రోజు కూలి రూ.6వందలు చెల్లించాలని అన్నారు. 200 పని దినాలను కల్పించాలని గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరించాలని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, ఎం.గంగన్న, డి.వెంకటమ్మ సహాయ కార్యదర్శి నవీన్ కుమార్, పెర్క దేవిదాస్, జిల్లా కమిటీ సభ్యులు అగ్గిమల్ల స్వామి, ఆర్ సురేందర్, పండుగ పొచ్చన్న, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్



ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ గ్రామీణ మండలం కచ్‌కంటి, అనుకుంట గ్రామాలలో ఆయన పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత, అలాగే మరణించిన, చిరునామా మార్పు వంటి ఓటర్ల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. వికలాంగులు, థర్డ్ జెండర్ల నమోదుకు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రముఖులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఓటర్ల వివరాలను జాబితాలో పరిశీలించుకోవాలన్నారు. ఓటరు జాబితాను ఆయా పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించాలని సూచించారు. అలాగే ఈ నెల 25 న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలనీ అన్నారు. పట్టణంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు గ్రామంలోని నూతన ఓటర్లతో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వివరాలు, గణితం టేబుల్స్, పద్యాలను అడిగి సమాధానాలను రాబట్టారు. విద్యార్థులు హాజరు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పర్యటనలో ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ దిలీప్ కుమార్, ఆయా బూత్ స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై అవగాహన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వద్యాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారి అశోక్ వర్మ లింగ సమానత్వం గురించి అవగాహన కల్పించారు. ఈనెల 24న జరిగే జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా లింగ సమానత్వం, లింగ సున్నితత్వం గురించి వివరించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, ఎన్నికల షెడ్యూలు, నోటీసు బోర్డుపై తరగతుల వారిగా విద్యార్థుల లిస్ట్ ప్రదర్శించినట్టు తెలిపారు. అమ్మాయిలను, అబ్బాయిలను అన్ని విషయాలలో సమానంగా చూడాలని అన్నారు. ఆరోగ్యం, సంక్షేమ విషయంలో సమానంగా శ్రద్ధ చూపాలని అన్నారు. ఇంటి పనుల్లో అమ్మాయిలు, అబ్బాయిలు ఇద్దరు పాలు పంచుకునేలాగా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు, బాల్య వివాహ నిరోధక చట్టం 2006 గురించి వివరించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే 1098 లేదా 100కు కాల్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూం టు రీడ్ మండల కోఆర్డినేటర్ గోవర్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

రేపు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శోభాయాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అయోధ్యలోని రామమందిరంలో 22న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదిలాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణ మర్చంట్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో భారీ శోభా యాత్ర చేపడుతున్నట్టు వర్తక సంఘం అధ్యక్షుడు కమల్ కిశోర్ అగర్వాల్ తెలిపారు. శనివారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు మార్వాడీ ధర్మశాల నుంచి శోభా యాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. పట్టణంలోని అన్ని వర్తక, వ్యాపార సంఘాలు, కుల, యువజన సంఘాలు, రామ భక్తులు శోభా యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 12.30కు ధర్మశాలలో మహా అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రాజేశ్వర్ కొత్తావార్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు వట్టం నర్సయ్య పాల్గొన్నారు.

గ్రామపంచాయతీని అభివృద్ధి చేస్తాం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామపంచాయతీని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామని సర్పంచ్ రాథోడ్ మధుకర్ అన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. 2024 సంవత్సరానికి సంబంధించిన గ్రామంలోని వాడలో నిర్వహించాల్సిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్, తదితర పనులపై సభ్యులతో కలిసి తీర్మానించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని గ్రామస్తులు అందరు సహకరించాలని కోరారు. గ్రామ సభలో డీఎల్పీఓ బిక్షపతిగౌడ్, ఎంపీఓ స్వప్న శీలా, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఉపసర్పంచ్ ఫడ్ విష్ణు, కార్యదర్శి కొల శేఖర్, వార్డు సభ్యులు నాగి బాయి, అశ్విని, గణేష్, మోతి లాల్, లక్ష్మణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ లేని సిగరెట్లు అమ్మడం నేరం : డాక్టర్ శ్రీధర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమార్పీ లేని సిగరెట్లను అమ్మడం నేరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లివార్ అన్నారు. శనివారం పట్టణంలోని దస్నాపూర్, మావలతో పాటు గుడిహత్నూర్‌లోని పలు దుకాణాల్లో జిల్లా పొగాకు నియంత్రణ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు తాము అమ్మే పొగ ఉత్పత్తులపై మ్యానుఫ్యాక్చరింగ్ డేట్, ఎమార్పీ, ఇతర పూర్తి సమాచారం ఉండాలని సూచించారు. బహిరంగ ధూమపానం నేరం అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. అనుమతి లేని పొగాకు ఉత్పత్తులు అమ్మిన వారిపై కోట్ప యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమన్నారు వారు పొగాకు ఉత్పత్తులు విక్రయించకూడదని సూచించారు. ఈ సందర్భంగా నిబంధనలను అతిక్రమించి అనుమతి లేని పొగాకు ఉత్పత్తులు అమ్మిన ముగ్గురు దుకాణ యజమానులకు ఆయన జరిమానాలు విధించారు. ఆయన వెంట తనిఖీ బృందం సభ్యులు శ్రీకాంత్, క్లినికల్ సైకాలజిస్ట్, సోషల్ వర్కర్ చిరంజీవి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రేపు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనవరి 22న రోజు అయోధ్యలోని శ్రీ రామ మందిరం నిర్మాణం జరిగి బాలరాముడి ప్రాణప్రతిష్ఠను విద్యార్థిని, విద్యార్థులు ఆ శుభ కార్యక్రమాన్ని వారి ప్రాంతాలలో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని కోరుతూ ఈ విషయమై జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, సాయి, నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



బెల్లంపల్లి నుండి కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం వంజీరి సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు వంజీరి గ్రామం ప్రధాన రహదారిలో తనిఖీ చేపట్టారు. మంచిర్యాల నుంచి అవనిగట్టి సాంబమూర్తి మహేంద్ర ట్రాలీ ఆటో(టీఎస్ 19టి4432)లో నాలుగు సంచుల పీడీఎస్ బియ్యం పట్టుకుని కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు నింధితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సీహెచ్ రాణా ప్రతాప్ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్ కుమార్, పీసీలు వేముర్ల మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో రోడ్డుకు మరమ్మత్తులు

నవతెలంగాణ-బెజ్జూరు



మండలంలోని రెబ్బెన నుండి కొత్తగూడ వరకు గుంతలమయంగా మారిన రోడ్డుకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం మరమ్మత్తులు నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా రహదారి గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు. గుంతలు పడిన ప్రాంతాల్లో మొరం పోసి రోడ్డుకు మరమ్మత్తులు చేయించారు. అటవీ శాఖ అనుమతులు తీసుకొచ్చి రోడ్డు వేయించేలా చర్యలు చేపడుతామన్నారు. రోడ్డును బాగు చేయించడంతో ప్రయాణికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్వాయి శ్రావణ్‌రావు, సర్పంచ్ కారం వనిత సతీష్, ఉప సర్పంచ్ పేట శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, చిలుకయ్య, మడె గణేష్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఎన్నికల సంఘం స్పెషల్ కాంపైన్ డే సందర్భంగా శని, ఆదివారాల్లో ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని, అలాగే బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు, సవరణలు, ఏవైనా తప్పులుంటే మార్పుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. బొంబాయిగూడ గ్రామంలోని పోలింగ్ బూత్ నెంబర్ 243ను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సురేష్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గ్రామాల్లో తహసీల్దార్ పర్యటన..

మండలంలోని బెండారా, వాంకిడి, జైత్‌పూర్, బంబారా గ్రామాల్లో శనివారం తహసీల్దార్ రెహిమొద్దీన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. జనవరి 1, 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సొంత ఖర్చులతో మరుగుదొడ్డి నిర్మాణం



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని దుబ్బగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సొంత డబ్బులతో మరుగుదొడ్డి నిర్మించి ప్రారంభించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు పోలీస్ కానిస్టేబుల్ పంజాల నివాస్‌గౌడ్. కాగజ్‌నగర్ నివాసి అయిన ఆయన తన తండ్రి దివంగత పంజాల మొండయ్య జ్ఞాపకార్థం పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని సంకల్పించారు. మరుగుదొడ్డి లేని దుబ్బగూడ పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మించి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్మీర్ సర్పంచ్ తరుణం సుల్తానా, బీబ్రా సర్పంచ్ బండ కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు సృజన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలకు మౌళిక వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న నివాస్‌గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీబ్రా ప్రధానోపాధ్యాయులు కంబాల జయేందర్, దుబ్బగూడ గ్రామస్తులు తిరుపతి, వసంత్, ఆద్య, సుధాకర్ పాల్గొన్నారు.

సైన్స్‌తో దేశ పురోభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైన్స్‌తో దేశ పురోభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. ఫరీదాబాద్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన భారత అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్ ముగింపు సందర్భంగా జిల్లా నుండి పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపి అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్‌తో దేశ పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లా నుండి జాతీయస్థాయి ఫెస్టివల్‌కు విద్యార్థులు అర్హత సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు. విద్యార్థుల సృజనాత్మకత పెరగడానికి ఇటువంటి ఫెస్టివల్స్ ఉపయోగపడతాయన్నారు. రానున్న రోజుల్లో జిల్లా విద్యార్థులను మరిన్ని సైన్స్ ఫెయిర్లకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సైన్స్ ఫెస్టివల్‌లో జిల్లా నుండి ప్రవళిక(కేజీబీవీ దహెగాం), జి మనీషా(కేజీబీవీ కాగజ్ నగర్), కౌశిక్(జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, రాసిపెల్లి), వర్షిత్(ఆదర్శ పాఠశాల ఆసిఫాబాద్) కృష్ణతేజ(జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల,రాస్‌పెల్లి), అక్బర్ అలీ(జిల్లా పరిషత్ పాఠశాల పెట్రోల్ పంపు, కాగజ్ నగర్) పాల్గొన్నారని, వీరికి సహాయ టీచర్లుగా మామిడాల తిరుపతయ్య, లక్ష్మీ ప్రసన్న వెళ్ళినట్లు తెలిపారు. విజయవంతంగా ఫెస్టివల్ పూర్తిచేసుకుని జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో తెలిపిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో వీరు మరింత మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నవతెలంగాణ-దహెగాం

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. శనివారం మండల నూతన కమిటీని ఎన్నుకున్న అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా టీయూటీఎఫ్ పనిచేస్తూ రాష్ట్రంలోనే అగ్రగామి పోరాట సంఘంగా ఉందని తెలిపారు. 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి గృహాలకు పంపించాలన్నారు. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసేల విద్యావాలంటీర్ల నియామకం చేపట్టాలన్నారు. కేజీబీవీ గృహశిక్ష జియాన్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్‌తో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చాపిడి శ్రీనివాస్, మండల బాధ్యులు పాల్గొన్నారు.

మండల నూతన కమిటీ ఎన్నిక

మండల కేంద్రంలో టీయూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుర్గం తులసీరాం, ప్రధాన కార్యదర్శిగా రోహిత్, ఉపాధ్యక్షుడిగా అంజయ్య, ఉపాధ్యాక్షురాలుగా రిజ్వానా, కోశాధికారిగా లక్ష్మణ్, కార్యదర్శులుగా శివ, భారతి, మధునశ్రీ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జ్యోతి, కోకన్వీనర్‌గా లలిత, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ సాయి, కోకన్వీనర్‌గా సంతోష్, అకాడమిక్ కమిటీ కన్వీనర్‌గా మహేష్, కోకన్వీనర్‌గా సదానందం, మహిళా కమిటీ కన్వీనర్‌గా సాహితి, కోకన్వీనర్‌గా మమత, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా సృజన, కోకన్వీనర్‌గా స్రవంతి, వాయిస్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్‌గా కుమారస్వామి, కోకన్వీనర్‌గా బ్రహ్మంను ఎన్నుకున్నారు.

మహిళలు ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలికలు, మహిళలు, ఉద్యోగిణులు ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సైనికులుగా ఎదిగి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శనివారం బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై నిర్వహించిన స్మార్ట్ యోధా మహిళా స్వశక్తి కార్యక్రమంలో ఆదిలాబాద్ మహిళా స్వశక్తి సమన్వయకర్త మాధవితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగిణులు, మహిళలు తమ నిత్యజీవితంలో ఎన్నో రకమైన లైంగిక వేధింపులు, దాడులు, వరకట్న వేధింపులకు గురవుతున్నారన్నారు. ఉద్యోగులు తాము పనిచేసే కార్యాలయాలలో పై అధికారుల వేధింపులకు గురవుతున్నారన్నారు. ప్రతి బాలిక, విద్యార్థిని, ఉద్యోగిణి, మహిళ గుండె నిబ్బరంతో ఉండి ఎలాంటి పరిణామాలనైనా మనోధైర్యంతో ఎదుర్కొనే విధంగా సన్నద్ధమవ్వాలన్నారు. ప్రతి మహిళ ఓ సైనికురాలిగా ఎదగాలని అన్నారు. సమాజంలో బాలికలు, మహిళలు, ఉద్యోగిణులు తమ దయనందిన జీవితంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలకు సమస్యలను ఎదుర్కొనే చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, జిల్లా విద్యాధికారి అశోక్, ఉద్యోగులు, షీ టీం సభ్యులు, విద్యార్థినులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత : డీఎఫ్ఓ

- డీఎఫ్ఓ నీరజ్ కుమార్ ఫిబ్రెవాల్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ ఫిబ్రెవాల్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో పులి దాడిలో చనిపోయిన పశువుల యజమానులకు చెక్కులను అందజేశారు. మురళీగూడ గ్రామానికి చెందిన తలండి నారాయణకు రూ.12 వేలు, మడప శ్రీనివాస్‌కు రూ.25 వేలు, దుర్గం గంగారాంకు రూ.8 వేలు, లావుడ్య రమేష్‌కు రూ.9 వేలు, కొడప బిచ్చుకు రూ.5 వేలు, నానయ్యకు రూ.8 వేలు, మడె నారాయణకు రూ.13 వేలు, సిడాం శంకర్‌కు రూ.22 వేలు, కామెర లక్ష్మణ్, పెద్దల పెంటయ్యకు చెరో రూ.7 వేల చొప్పున చెక్కులు మంజూరయ్యాయి. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ గంగాసింగ్‌తో కలిసి వాటిని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులపై పులి దాడి చేసినప్పుడు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని, తక్షణమే చనిపోయిన పశువు వద్దకు అటవీ అధికారులు వచ్చి రూ.ఐదు వేల చెల్లిస్తారన్నారు. మిగతా సొమ్మును ఐదు రోజుల్లో బాధితుడికి అందిస్తామని తెలిపారు. వన్యప్రాణులను వేటాడం, విష ప్రయోగం చేయడం తీవ్రమైన నేరమని, చట్టప్రకారంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చవద్దని, అమర్చితే జంతువులతో పాటు మనుషులు కూడా మృతిచెందే అవకాశముంటుందన్నారు. అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెజ్జూరు రేంజ్ అధికారి దయాకర్, పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి రేంజర్ సుధాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్, సెక్షన్ అధికారులు జగన్మోహన్‌గౌడ్, వేణుగోపాల్, పశు వైద్యాధికారి రాకేష్,




బాధితులకు చెక్కులు అందిస్తున్న డీఎఫ్ఓ నీరజ్ కుమార్ ఫిబ్రెవాల్

ఏఈఓలు శ్రీవిద్య, లావణ్య, ఏఎస్సై ప్రభాకర్, సర్పంచులు జాజిమొగ్గ శ్రీనివాస్, చంద్రమౌళి, రాజన్న పాల్గొన్నారు.

బెజ్జూరు : పులి దాడిలో మృతిచెందిని పశువుల యజమానులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. శనివారం మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయంలో సర్పంచ్ అన్సర్ హుస్సేన్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా పులి దాడిలో చనిపోయిన పశువుల యజమానులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు శ్రీనివాస్, మల్లికార్జున్, ఏఈఓ మీనా, బీట్ అధికారులు అనిత, సంగదీప్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో 22 పరీక్ష కేంద్రాల్లో 3703 మంది హాజరు



కాగజ్‌నగర్ రూరల్: ప్రవేశపరీక్షను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 6వ తరగతిలో 80 సీట్లు ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 4,458 మంది దరఖాస్తు చేసుకున్నారు. విద్యాలయ ప్రిన్సిపల్ చక్రపాణి ఆధ్వర్యంలో పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఉదయం 11.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాలను 14 బ్లాకులుగా విభజించి 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 4 పరీక్ష కేంద్రాల్లో 983 మంది విద్యార్థులకు 819, నిర్మల్ జిల్లాలో 6 పరీక్ష కేంద్రాల్లో 1,208 మంది విద్యార్థులకు 1055 మంది, మంచిర్యాలలో 7 పరీక్ష కేంద్రాల్లో 1,188 మందికి 979 మంది, కుమురంభీం జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో 1,079 మందికి 850 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఉదయామే విద్యార్థులు హాల్ టికెట్లతో పాటు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డులను వెంట తీసుకుని కేంద్రాలకు చేరుకున్నారు. ఆసిఫాబాద్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, నవోదయ ప్రిన్సిపాల్ చక్రపాణి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తంగా 4458 మంది విద్యార్థులకుగానూ 3703 మంది హాజరై 82 శాతం హాజరు నమోదు చేశారు.

సిర్పూర్(టి) : జవహర్ నవోదయ విద్యాలయం ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్ష మండలంలో ప్రశాంతంగా ముగిసినట్టు మండల విద్యాధికారి సోమయ్య తెలిపారు. శనివారం తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్షకు 228 మంది విద్యార్థుల్లో 189 మంది విద్యార్థులు హాజరుకాగా 39 మంది గైర్హాజరయ్యారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా సంధ్యారాణి ఆధ్వర్యంలో సదాశివుడు, సీఎల్‌ఓగా వందన విధులు నిర్వహించారు.

గంగాపూర్ జాతరను ఘనంగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో జరగనున్న బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మిలతో కలిసి దేవాదాయ ధర్మాదాయ, పంచాయితీ రాజ్, మిషన్ భగీరథ, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా జాతరలో పారిశుద్ధం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సౌకర్యాల ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిపై మిషన్ భగీరథ, భక్తులకు క్యూ లైన్ ఏర్పాట్లపై దేవాదాయ శాఖ, పారిశుద్ధ్య పనులపై గ్రామపంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆదేశించారు. తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేసే విధంగా మండల పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, పార్కింగ్‌కు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్.ఈ. వెంకటపతి, రెబ్బెన తహసీల్దార్ సమీర్ అహ్మద్, జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-కెరమెరి

ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జెండర్ స్పెషలిస్ట్ రాణి అన్నారు. శనివారం మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మండల సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళా సాధికారత, బేటీ బచావో బేటి పడావో వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళలు ప్రతి రంగంలో రానించాలని, మహిళలకు చట్టాలపై అవగాన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపులకు గురైతే మహిళా హెల్ప్ లైన్ 181కి ఫోన్ చేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రిత్యా నేరమన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్థిక నిపుణుడు సాగర్ మాట్లాడుతూ పది సంవత్సరాలలోపు ఉన్న ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిపించాలన్నారు.ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పొదుపు పథకాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఆ దిశగా మహిళలు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జగదీశ్వర్, మహిళ సమాఖ్య మండల ఉపాధ్యాక్షురాలు రాధ, సభ్యులు పాల్గొన్నారు.

శివ మల్లన్న ఆలయ శుద్ధి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని ఈజ్‌గాం శివ మల్లన్న ఆలయంలో శనివారం ఆలయ శుద్ధి నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరగనుందని, అంతకు పూర్వమే ఆలయాల్లో శుద్ధీకరణ నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అదే రోజు ప్రతి ఒక్కరు ఇండ్లలో పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ధోనీ శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారయణ, మండల అధ్యక్షులు రవీంద్ర బిశ్వాస్, ఎంపీటీసీ బికాస్ ఘరామి, సర్పంచులు పుల్ల అశోక్, దోతుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి సమీర్ గుప్తా, మాజీ ఎంపీటీసీ అంబనగంటి సాంబయ్య, పిర్సింగుల తిరుపతి, లోనారె రవీందర్, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి అహ్మద్ ఓమర్ హుస్సేన్ అన్నారు. పంచాయతీ ఆవరణలో 2024-25కు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు హాజరు కాగా ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనిలో ప్రజలను భాగస్వాములను చేసి ముందుకు వెళ్లనున్నట్లు వివరించారు. పట్టణ ప్రజలు గ్రామ సభ దృష్టికి పలు సమస్యలు తీసుకుని వచ్చారు. పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, టీఆర్ నగర్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద పైప్ లైన్ రిపేరు చేయాలని, పైకాజి నగర్ సామిల్ పక్కన రహదారిపై కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలని, ఆర్ఆర్ కాలనీలో బోర్ వెల్‌కు హ్యాండ్ పంపు ఏర్పాటు చేయాలని, స్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతుందని దాని చుట్టూ కంచే ఏర్పాటు చేయాలని కోరారు. మార్కండేయ కాలనీ, జనకాపూర్ వెనుక వైపు గల కాలనీలో రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని విన్నవించారు. సమస్యలు సావధానంగా విన్న అధికారులు పరిష్కారం కోసం త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సదాశివ్, భగీరథ డీఈ మదిన్, పంచాయతీ ఈఓ వంశీకృష్ణ, సెక్రెటరీ రవి, సిబ్బంది సంతోష్, నాగేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు చేయూతనందిస్తాం



నవతెలంగాణ-దహెగాం

మారుమూల గ్రామాల్లో అంతరించిపోతున్న చేతివృత్తి దారులకు చేయూతనందిస్తామని మిథానీ కంపెనీ మేనేజర్ డాక్టర్ బాలాజీ అన్నారు. శనివారం మండలకేంద్రంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మిథానీ కంపెనీ సహకారంతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వెదురు వస్తువుల తయారీ సెంటర్‌ను అసిస్టెంట్ మేనేజర్ అమన్, టూరిజం శాఖ జిల్లా అధికారి రామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టును జిల్లాలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వెదురుతో వస్తువులను తయారు చేసే విధానంపై మేదరి, కొలాం జాతుల వారికి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం వారు తయారుచేసిన వెదురు వస్తువులను మార్కెటింగ్ చేయడానికి కూడా వెసులుబాటు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం చేతి ద్వారా చేసే పనిని నేర్పిస్తున్నామని, తర్వాత మిషన్‌ల ద్వారా కూడా పని చేసే విధానాన్ని నేర్పిస్తామన్నారు. సుమారు రూ.60 లక్షల నిధులు కేటాయించి నెల రోజుల పాటు ఆయా మండలాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణ పూర్తి చేసుకొని నైపుణ్యతనుపెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాపాల శ్రీనివాస్, కోశాధికారి దీకొండ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు బూరం పోశన్న జిల్లా యూత్ అధ్యక్షుడు వెంకటేష్, మండల యూత్ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఉచిత రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ రక్త పరీక్షల వల్ల మనుషుల్లో ఉండే 135 రకాల వ్యాధులను తెలుసుకోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టడం చాలా అభినందనీయమన్నారు. అలాగే మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఈ రక్త పరీక్షలలో 200పైగా నుంచి నమూనలను సేకరించారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తారిక్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు రమణారెడ్డి, నాంపల్లి శంకర్, కోట వెంకన్న, సాయిని నర్సింహులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



నవతెలంగాణ-దహెగాం

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆపరేషన్ ముస్కాన్ ఎస్సై గంగన్న అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలకేంద్రంలోని దుకాణ సముదాయాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే బాల కార్మికుల చట్టం ప్రకారం పనిలో పెట్టుకున్న యజమానితో పాటు పనికి పంపిస్తున్న తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తునట్ట కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-జన్నారం

క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్‌బీఐ జన్నారం బ్రాంచ్ మేనేజర్ మహేష్, స్లేట్ ప్రయివేట్ పాఠశాల ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం స్లేట్ హైస్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు అనేటివి మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని అలాగే క్రీడలు ఆడటం వలన మనిషి దృఢంగా ఉండటం జరుగుతుందన్నరు. అంతేకాకుండా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వడంతో భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగలలో క్రీడకు సంబంధించి రిజర్వేషన్ ఉంటుందన్నరు. ఈ కార్యక్రమంలో స్లేట్ హైస్కూల్ ఫౌండర్ ఏనుగు సుభాష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పూజా, అడ్మినిస్ట్రేటర్ ఏనుగు రజిత, ఉపాధ్యాయులు సంతోష్, నగేష్, నాగలక్ష్మి, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

సైబర్ నేరాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని లక్షెట్టిపేట సీఐ కృష్ణ, జన్నారం ఎస్సై సతీష్ సూచించారు. మండలంలోని బాదంపల్లి గ్రామంలో, సైబర్ నేరాలు, బ్యాంకు ఓటీపీలు అక్రమ ఇసుక రవాణా, అక్రమ బెల్టు షాపుల నిర్వహణ, అక్రమ గుడుంబా తయారీ పలు అంశాలపై పోలీసు కళాబృందం సభ్యులతో పాటలు, నాటికల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ పెరుగుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత చెడు బాట పట్టవద్దని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాలని, బ్యాంకు ఖాతాల విషయంలో ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కళాకారులు, బాదంపెల్లి సర్పంచ్ అశోక్ కుమార్, ఉపసర్పంచ్ ఆనందం, సంతోష్, లచ్చన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చుని ఎంపీడీఓ అరుణరాణి ఎంఈఓ విజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కిస్టాపూర్ కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలలోని టెన్త్, ఇంటర్ విద్యార్థులకు, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు టెన్త్‌లో ప్రతి ఒక్కరు 10/10 జీపీఎస్ సాధించి ఇంటర్‌లో ఏ గ్రూప్ తీసుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలని సూచించారు. తద్వారానే భవిష్యత్తులో, వారు ఎంచుకున్న గోల్‌ను సాధిస్తారన్నారు. అలాగే ఇంటర్ విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, ఇంజనీరింగ్ ఎంసెట్ డిగ్రీ ఇతర ఒకేషనల్, తమకు నచ్చిన కోర్సులను ముందుగానే ఎంచుకొని ముందుకెళ్లాలన్నారు. ఇప్పటి నిర్ణయంతోనే భవిష్యత్తులో ఏ స్థాయిలో స్థిరపడాలో తెలుస్తుందన్నారు. అందుకే ముందు అవగాహనతో చదివి మంచి స్థాయిలో స్థిరపడాలని సూచించారు. అప్పుడే తాము ఎంచుకున్న గోల్‌ను సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ రమేష్, ఎఫ్ఎస్ఓ కిరణ్ మహి జ్యోతి, ఎస్సై మృత్యుంజయ్ సర్కార్, మండల వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు ఎంపిక



నవతెలంగాణ-తాండూర్

మంచిర్యాల జిల్లా స్థాయి విజ్ఞానమేలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తాండూర్ మండలం కాసిపేట హైస్కూల్‌కు చెందిన గంప శ్రీనివాస్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గత సంవత్సరం జిల్లా, అంతర్ రాష్ట్ర స్థాయిలలో నిర్వహించిన విజ్ఞానమేలలలో పాల్గొని పలు బహుమతులను గెలుపొందారు. గత సంవత్సరం కేరళలో నిర్వహించిన గణిత శాస్త్రం బోధనాభ్యాసాల పరికరాల తయారీ విభాగంలో శ్రీనివాస్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఈ సంవత్సరం జిల్లా స్థాయి విజ్ఞాన మేళాలో విద్యార్థుల ద్వారా మొత్తం 116 ప్రాజెక్టులు విజ్ఞాన మేళాలో పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతల ద్వారా అత్యుత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ఎంపికయిన వీరు ఈ నెల జనవరి 23, 24 తేదీలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడే రాష్ట్రస్థాయి విజ్ఞానమేళాలో పాల్గొననున్నారు. బాల వైజ్ఞానిక ప్రదర్శన జిల్లా స్థాయి పోటీలలో బోధనాభ్యాసన పరికరాల విభాగంలో గంప శ్రీనివాస్ ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు సెమినార్ విభాగంలో ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎం.వర్షిత ఎంపికైనట్లు వివరించారు

22న మాంసం అమ్మకాలు నిలిపివేయాలి

నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 22న మండలంలో మాంసం అమ్మకాలు నిలిపివేయాలని బీజేపీ అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు కోరారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ 22వ తేదీ సోమవారం రోజున అయోధ్యలో శ్రీరామచంద్రుని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఉన్నందున, ఆరోజు మాంసం విక్రయాలను అధికారికంగా నిలిపివేయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశెట్టి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, రామగౌని మహీధర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి దూడపాక భరత్, మండల ఉపాధ్యక్షుడు కోమండ్ల శ్రీనివాస్, పుట్ట కుమార్, మండల కార్యదర్శి సిద్ధం మల్లేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బీజేపీ నాయకులు ఏముర్ల ప్రవీణ్, బుచ్చయ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మామిడి తోట దగ్ధం

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ మండలం కత్తెర్ల శివారులోని రౌతు విజయలక్ష్మికి చెందిన మామిడి తోటలోశుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు పరిసర ప్రాంతంలోని కలుపు మొక్కలకు నిప్పు పెట్టడంతో వంటలు వ్యాపించి మామిడి తోట దగ్ధమైంది. సుమారు మూడు ఎకరాల పరిధిలో మంటలు వ్యాపించగా 100కు పైగా మామిడి చెట్లు పూర్తిగా కాలిపోవడంతో మామిడి రైతు ఆందోళనకు గురయ్యారు. నష్టపరిహారం చెల్లించాలని తహసీల్దార్‌కు ఉద్యానవన శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు.

29న మోడల్ స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కాలేజిలో ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు తరగతికి ముగ్గురు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు, కమిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. ఓటర్లుగా విద్యార్థుల తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడు ఉంటాడన్నారు. 20న ఓటరు జాబితా ప్రకటన, 22, 23న అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా విడుదల, 29న ఎన్నికలు ఉంటాయన్నారు.

బీజేపీ మత రాజకీయాలను తిప్పికొట్టాలి

- 16న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ పిలుపు



నవతెలంగాణ-నస్పూర్

బీజేపీ మత తత్వ రాజకీయాలను తిప్పికొట్టాలని, ఫిబ్రవరి 16వ తేదీ అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గోమాస ప్రకాష్ అధ్యక్షతన సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తు, కార్పొరేట్, మతోన్మాద, నయా ఉదారవాద విధానాల వలన ప్రజలు, కార్మిక వర్గం రైతాంగం, పేద ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను గుర్తించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపుతూ అయోధ్య రామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, విద్యుత్ సంస్కరణ బిల్లు, కార్మిక చట్టాల మార్పు, నేషనల్ మానిటైజేషన్, జీఎస్టీ, ఇలా అనేక రకాల చట్టాలు తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాల ప్రజల ఆస్తులను దోచుకొని పెట్టుబడుదారులు, కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ వారికి లాభం చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు ఉన్నాయన్నారు. కాబట్టి ఈ బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మిక వర్గం, రైతాంగం, ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు, (రైతు సంఘాల ఐక్యవేదిక) సంయుక్త కిసాన్ మోర్చా , అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కాబట్టి జిల్లాల్లో ఉన్న స్కీమ్ వర్కర్లు, ప్రజలు, రైతులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు అందరూ గ్రామీణ బందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికారపు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నగేష్ , సీఐటీయూ జిల్లా నాయకులు బుచ్చన్న, సమ్మక్క, శోభ రాజేశ్వరి, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండిన వారు తప్పక ఓటు నమోదు చేసుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో 18 ఏండ్లు నిండిన వారితో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా శనివారం మంచిర్యాల పట్టణంలోని మజీద్వాడలో గల 190, 191, అశోక్ రోడ్లోని 202, హమాలివాడలోని 199, 200, 201 పోలింగ్ కేంద్రాలలో నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని మంచిర్యాల ఆర్డీఓ వి.రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కొరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6, 7, 8 దరఖాస్తు ఫారములు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. జనవరి 1, 2024 ను ప్రామాణికంగా తీసుకొని 18 ఏండ్లు నిండిన వారి వివరాలతో నూతన ఓటరు నమోదు చేయడం జరుగుతుందని, మరణించిన వారి వివరాలను ఓటరు జాబితా నుండి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 6న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై ఈ నెల 22వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి ఫిబ్రవరి 2వ తేదీలోగా అభ్యంతరాలను, ఫిర్యాదులను పరిష్కరించి 8వ తేదీన తుది ఓటరు జాబితా రూపొందించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకోవాలి

నవతెలంగాణ-తాండూర్



విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని కలలను సాకారం చేసుకోవాలని తాండూర్ తహసీల్దార్ రోహిత్ తెలిపారు. శనివారం తాండూర్ కస్తూర్బాలో ఏర్పాటు చేసిన కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాములో మాట్లాడారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, మెడికల్ ఆఫసర్ కుమారస్వామిలకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్షాల కోసం కలలు కనలని కలలు సాకారం అయ్యేందుకు పట్టుదలగా కృషి చేయాలన్నారు. పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడినప్పుడే సంఘంలో మంచి పేరు ప్రతిష్ట లభిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల పేరు ప్రతిష్ఠల కోసం సమాజంలో ఉన్నత స్థానం కోసం కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని దేశ భవిష్యత్తులో పాల్పంచుకోవాలని తెలియజేశారు. కస్తూర్బా పాఠశాలలో ప్రభుత్వం చదువుతోపాటు అన్ని రకాల వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. సౌకర్యాలను అందిపుచ్చుకొని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. సీడీపీఓ ఉమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బంగారు భవిష్యత్తుకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. తెలిసి తెలియని వయసులో వివాహాలు చేసుకొని కష్టాలను కొనితెచ్చుకోవద్దన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు బాల్యవివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై ప్రభుత్వం చట్ట పరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ జీ.సుమన చైతన్య, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాలపై విద్యార్థులు వేసిన నాటిక పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, పోలీస్ అధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం, మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు గుర్తింపు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి సింగరేణి నూతన భూగర్భ గనులు తీసుకురావాలని కోరారు. అలాగే సింగరేణి యాజమాన్యం బిడ్‌లలో పాల్గొనే విధంగా యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని, సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని అన్నారు. కోల్ ఇండియాలో కార్మికులకు యాజమాన్యం చెల్లిస్తున్నటువంటి సింగరేణిలో పెర్క్స్ పై ఐటి మినహాయింపును అధికారులకు చెల్లిస్తున్న యాజమాన్యం కార్మికులకు కూడా చెల్లించే విధంగా చూడాలని, ఇటీవల హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 149 మంది జూనియర్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి సమస్యలు తొందర్లోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు సారయ్య, కె వీరభద్రయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

- రెవెన్యూ డివిజనల్ అధికారి రాములు



నవతెలంగాణ-దండేపల్లి

పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. నూతన ఓటర్లు, మార్పులు చేర్పులు చేసుకోవాల్సిఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు రికార్డులు పరిశీలించి పకడ్బందీగా నూతన ఓటర్ నమోదు చేస్తూ ఎవరైనా చనిపోయిన లేక మార్పులు చేయాలనుకున్న దరఖాస్తులు స్వీకరించి చేయాలని సూచించారు. 01.01.2024 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అర్హులని ఆయన తెలిపారు. ఓటర్ జాబితాలో చిరునామా పోలింగ్ కేంద్రాల మార్పుల గురించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భూమన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌గౌడ్ ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల కెరీర్‌పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

స్థానిక కేజీబీవీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి తల్లితండ్రుల ఆశయాలు నెరవేర్చాలని కోరారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, ఏఓ చల్ల ప్రభాకర్, మున్సిపల్ కమీషనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని వినతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ శనివారం మందమర్రి జీఎంకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ వినతిపత్రం అందించారు. ఓపెన్ కాస్ట్‌లో భూమి కోల్పోయిన వాళ్లకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వాలని, కాసిపేట మండలంలోని సింగరేణికి సంబంధించి రెండు మైన్‌లు, ఓపెన్ కాస్ట్, సోలార్ ప్లాంట్‌లు ఉన్నాయని, కాని సింగరేణి నుంచి తగిన నిధులు రావట్లేదన్నారు. సీఎస్ఆర్ నిధుల నుంచి కాసిపేట మండలంలో గ్రౌండ్‌కు చుట్టూ పెన్షన్, నీటి సౌకర్యం, లైబ్రరీ, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ యాదయ్య తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. పదోవ తరగతి విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు విద్యార్థుల నమోదు కూడా పెంచాలని సూచించారు. అనంతరం పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈ ఏడాది వంద ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పదోవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఈఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు రమణారెడ్డి పాల్గొన్నారు.

ఖాందేవుని జాతర పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఖాందేవుని జాతర పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ విడుదల చేశారు. తోడసం వంశస్థుల ఆరాధ్య దైవం ఖాందేవునికి ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభిస్తారన్నారు. జాతర విజయవంతానికి అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ ఆడే,తోడసం నాగోరావ్, ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు ఉత్తం రాథోడ్, రెడ్డి నాయక్, సర్పంచుల ఉర్వేత రూపదేవ్, కాంతారావు దుర్గే, షేక్ దాదేఅలీ, సికిందర్ రాథోడ్, మాజీ ఎంపీపీ రూప్‌దేవ్, కరీం ఖాన్, బాపూరావు మోహన్ పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో శనివారం పీఆర్‌టీయూ-2024 నూతన తెలంగాణ క్యాలెండర్‌ను మండల విద్యాధికారి సోమయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి హన్మంతు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణ్ సింగ్, అరుణ్, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామగిరి సాయికిరణ్, వడాయి ఉమేష్, చింతలమానెపెల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పిప్పల్‌ధరి మండల సాధన కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

పిప్పల్‌ధరి మండల సాధన కమిటీ' క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అంతకు ముందు కమిటి సభ్యులు ఎమ్మెల్యేను శాలవాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ పిప్పల్‌ధరి మండల ఏర్పాటుకు తన వంతుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటి అధ్యక్షులు తెలంగ్ బాపురావు, యువకులు మునేశ్వర్ విజయ్, బండారి ప్రణీత్, గంగన్న, నరేష్, దినేష్, భగత్ మహేష్, తెలంగ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వార్షిక అభివృద్ధి పనులపై గ్రామసభ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని శంకర్ గూడ పంచాయతీలో వార్షిక ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీకి వచ్చే ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్‌తో పాటు అభివృద్ధి నిధులపై చేసిన ఖర్చులను పంచాయతీ కార్యదర్శి ప్రమీల సభ్యులకు వివరించారు. పంచాయతీలకు ప్రభుత్వం నుంచి ప్రతి ఏటా వచ్చే నిధులు, సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ మెంటనేన్స్, శానిటేషన్, వీధి విద్యుత్ దీపాల అలంకరణ తదితర అభివృద్ధి పనులు నిరంతరంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం ఇటీవల గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బేటరీతో పాటు కొన్ని వస్తువులు చోరికి గురికావడంతో ఇలాంటి సంఘటనలు పునారావృత్తం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేయడంతో ఆ అంశాన్ని తీర్మాణించారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ తుమ్రం లక్ష్మణ్, ఉప సర్పంచ్ సుధీర్, గ్రామస్తులు బాలాజీ, అసద్, అంగన్‌వాడీ కుష్వర్త పాల్గొన్నారు.

22న సెలవు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-బెజ్జూరు

ఈ నెల 22న అయోధ్యలోని రామాలయంలో ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా సెలవు ప్రకటించడంతో పాటు గ్రామాల్లో బెల్ట్ షాపులు, మద్యం దుకాణాలను మూసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భువనేశ్వర్‌కు ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, తెలంగాణ జావిద్ ఇదే విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణప్రతిష్ట రోజు జంతువు వధ జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ, ప్రయివేటు, ఆశ్రమ పాఠశాలలకు, కళాశాలలకు ఆ రోజున ప్రత్యేక సెలవులు ప్రకటించి విద్యార్థులకు ప్రత్యేకంగా శ్రీరామచంద్రుని గురించి తెలియజెప్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మూస అరుణ్, గోగునూరు తిరుపతి, తునికి రాజేష్, కుదురుపాక సంజీవ్, తొర్రెం తిరుపతి, తుమ్మల రవి, మొర్లె చంద్రశేఖర్, సాగర్, చిరంజీవి, మోహన్ పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-కాసిపేట

మంచిర్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని ప్రధాన కౌశల్ కేంద్రం నిర్వాహకులు దేవేందర్, రామసురేకాంనంద్ తెలిపారు. 14 నుంచి 45 ఏళ్ల నిరుద్యోగులకు మంచిర్యాల ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం, అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రయివేటు లిమిటెడ్ సంయుక్తంగా 5జీ టెక్నిషన్, డ్రోన్ టెక్నిషన్, ఎలక్ట్రానిక్ అసెంబ్లీ టెక్నిషన్, సోలార్ ప్యానల్ టెక్నిషన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో కంప్యూటర్, టాలీ, స్పోకెన్ ఇంగ్లీష్, పోటీ పరీక్షలు, జనరల్ నాలెడ్జ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని యువతీ, యవకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కోసం ఎడ్యూకేషన్ సర్టిఫికెట్స్, ఆధార్, పాస్ ఫోటోలతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్లోని కోటక్ మహీంద్రా బ్యాంక్ సమీపంలోని ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రంలో ఈ నెల 29వ తేది సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 709578099, 7095807999, 709590699 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం సైతం పోలీస్ పరేడ్‌లో, జాతీయ పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల బహూకరణ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమాలకు హాజరయ్యే ముఖ్య అతిథులకు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు తాగునీరు, టెంట్లు వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యఅతిథి సందేశానికి ఈనెల 22లోగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఆయా శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా స్టాల్స్ ఏర్పాటుతో పాటు శకటాలను రూపొందించాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంసా పత్రాలను సిబ్బంది పేర్లను పంపించాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలనీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా మహా యాగం

- పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు
- భారీగా హాజరైన రామబక్తులు

నవతెలంగాణ-హాజీపూర్

అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో శ్రీసుదర్శన నరసింహ సహిత విశ్వశాంతి శ్రీరామాయణ మహా యాగం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శనివారం యాగం ఆరంభం సందర్భంగా శ్రీవిశ్వనాథ ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్యే ఆయన సతీమణి సురేఖ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశంను యాగశాలకు తీసుకువచ్చారు. విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర వాటర్ ట్యాంక్, మార్కెట్ రోడ్ మీదుగా యాగ స్థలం జడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా స్థలం వరకు కొనసాగింది. శోభాయాత్రలో మహిళల కోలాటం ఆకట్టుకుంది. వేద పండితుడు నరసింహ శాస్త్రి నేతృత్వంలో పండితులు యాగక్రతువు ప్రారంభించారు. తొలి రోజు విశ్వసేన మహాగణపతి పూజ, పుణ్యాహవనం యాగంను నిర్వహించారు. ప్రేమ్ సాగర్ రావు, సురేఖ దంపతులతో వేదపండితులు యాగం చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగశాలను దర్శించి ప్రదక్షిణలు చేశారు. అనంతరం సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామిలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

యాగం సందర్భంగా ప్రేమ్ సాగర్ రావు భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. విశ్వశాంతి, మంచిర్యాల నియోజకవర్గంలో రామరాజ్య పాలన సాగాలనే సంకల్పంతో యాగం తలపెట్టినట్లు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా యాగం నిర్వహించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

ఆసక్తికి అనుగుణంగా భవిష్యత్ చదువును ఎంచుకోవాలి

- ఎంపీడీఓ సత్యనారాయణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై ఉపేందర్

నవతెలంగాణ-జైపూర్

పదవ తరగతి పూర్తి చేసి పై చదువులు చదువుకోవడానికి విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా భవిష్యత్తు చదువును ఎంచుకోవాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎస్సై ఉపేందర్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి శనివారం స్థానిక కస్తూరిబా పాఠశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. పాఠశాలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు భవిష్యత్తులో ఏఏ రంగాలలో స్థిరపడాలని ఆశిస్తున్నారో దానికి తగ్గట్టుగా సబ్జె చదువుల్లో కొనసాగాలని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో గల ఉద్యోగాలు, అవసరమైన చదువులు వివరిస్తూ విషయ పరిజ్ఞానాన్ని వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌రావు, ఏఓ మార్క్‌గ్లాడ్సన్, మెడికల్ ఆఫీసర్ సిందూర పాల్గొన్నారు.

భీమారంలో...

జిల్లా అదనపు కలెక్టర్ రాహూల్‌రాజ్ ఆదేశాల మేరకు శనివారం భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు ఉన్నత చదువులు, తద్వార భవిష్యత్తు లక్ష్యాలపై అవగాహన కల్పించినట్లు భీమారం ఎంపీడీఓ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులతో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. అదేవిధంగా పాఠశాల పూర్వ విద్యార్థి మంజుల లక్ష్యంతో కష్టపడి చదివిన తీరు, సాధించిన ప్రగతి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఆయన తెలిపారు.

హుషారుగా ముగిసిన ఎడ్ల బండ్ల పోటీలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాసాగర్ గ్రామంలో పాల్వాయి అభిమానుల సహకారంతో చేపట్టిన జరిగిన ఎడ్ల బండ్ల పరుగు పందాలు శనివారం ముగిశాయి. తాలూకా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పందాలలో 27 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి చింతలమానపల్లి మండల కేంద్రానికి చెందిన మెంత్యాల వెంకటేష్ గెలుపొందగా, రెండో బహుమతి భీమారం గ్రామానికి చెందిన సుమిత్ర యాదవ్ గెలుపొందారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ. 30,116, రెండో బహుమతి రూ.15,116 సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అందించి శాలువాతో సన్మానించారు. పోటీల్లో గ్రామ యువత పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కత్తెర్ల సుశీల మల్లేష్, చౌదరి నానయ్య, సుశీల్ మండల్, ఎంపీటీసీ జాబరి రాజన్న, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు, నాయకులు పాల్వాయి శ్రావణ్, ఎల్ములే మల్లయ్య, సత్పుతే తుకారాం, మోహన్, పవన్, పురుషోత్తం చారి, భీమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామనికి చెందిన బీజేపీ కార్యకర్తలు అడ్డసేర్ల సాయన్న, నరేష్‌ల తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలిసిన నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, పోతుగంటి అశోక్, రాజు కుమార్, చందలి విజయ్, నితీష్, రాకేష్, జడ్డి భోజన్న పాల్గొన్నారు.

రహదారి దాటకుండా బారికేడ్స్



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని బస్టాండు వద్ద రహదారిపై వాహనదారులు రోడ్డు దాటుతుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున శనివారం పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బారికేడ్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. నాలుగు వరుసల రహదారి పనుల్లో భాగంగా ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తగా రోడ్డుకు అడ్డుగా బారికెట్లు ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

అటవీ అధికారుల రక్తదానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు అటవీ అధికారులు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న వ్యక్తికి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే రేంజ్ పరిధిలో పనిచేస్తున్న శిక్షణ అధికారి సాయి చరణ్, బీట్ అధికారి ఆకుల రాజేష్ పట్టణానికి చెందిన జూల జ్యోతి అనే మహిళ రక్తహీనతతో బాధపడుతుందని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నారు. వెంటనే ప్రభుత్వ ఆసత్రికి చేరుకొని రెండు యూనిట్ల రక్తం దానం చేశారు. సమయానికి రక్తం అందించిన అటవీ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతాని అన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు తీర్మానం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ బండె తుకారాం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, నీటి సమస్యలు తదితర అంశాలపై చర్చించి అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. గ్రామసభలో ఈజీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీలు, విద్యుత్ శాఖ అధికారులు, వార్డుసభ్యులు, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులకు అక్షింతలు పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆసిఫాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు అక్షింతలు పంపిణీ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్, ఎమ్మెల్యే కోవలక్ష్మీ, ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, జిల్లాలోని అధికారులకు అయోధ్య బాల రామ అక్షింతలు, ఫోటోలు, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 22 జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయోజక్ ఇరుకుల్ల ఆంజనేయులు, సహ సంయోజక్ గుర్రాల వేంకటేశ్వర్లు, కొడిపాక వేణుగోపాల్, గుండేటి కోటేశ్వరరావు, రాజేశ్వర్, గందం శ్రీనివాస్, జంజిరాల శ్రీనివాస్, అనుమాండ్ల శ్రీకాంత్, శ్రీరాములు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు

నవతెలంగాణ-కెరమెరి

పకడ్బందీగా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని తహసీల్దార్ షరీఫ్ అన్నారు. రానున్న లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించిందన్నారు. శనివారం మండలంలోని 29 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది కూడా అవగాహన విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వివేక్, శవంత ఉన్నారు.

నేడు గంగాజలంకు మెస్రం వంశీయుల పాదయాత్ర

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన కేస్లాపూర్ నాగోబా జాతర ఫిబ్రవరి 9న పుష్యమాసం రోజు ప్రారంభం కానుంది. ఈ నెల 14న నాగోబా జాతర ప్రచార రథం ప్రధాన్ మెస్రం దాదేరావ్, ఖటోడ (పూజారి) మెస్రం కోసుల ఆధ్వర్యంలో బయల్దేరింది. వారం రోజుల పాటు వివిధ గ్రామాల్లో బస చేస్తూ జాతరపై ప్రచారం నిర్వహించారు. నాగోబా ప్రచార రథం శనివారం కేస్లాపూర్‌లోని మురాడీ (పురాతన ఆలయం) వద్దకు చేరుకుంది. ఆదివారం జిల్లాలోని వివిధ గ్రామాలకు మెస్రం వంశీయులు మురాడి వద్దకు చేరుకుంటారు. ఈ రోజున పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ ఆధ్వర్యంలో పవిత్ర గంగా జలం కోసం వెళ్ళే గ్రామాలు, బస చేసే చోటు తదితర అంశాలపై చర్చ గోష్టి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వారి ఆచార, సాంప్రదాయ పూజలు చేసిన అనంతరం నాగోబాకు అభిషేకించే గంగా జలం కోసం కాలినడక పయనమవుతారు.

నేటి సమావేశానికి అధికారులు హాజరు కావాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు ఓటరు జాబితా పరిశీలకులుగా ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి. భారతి లక్‌పతి నాయక్ నియమితులయ్యారు. ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో నిర్వహించనున్న సమావేశానికి జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన ఎన్నికల, సహాయ ఎన్నికల, బూత్ లెవెల్ అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.